క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన

రాపూరు: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ సునందన తెలిపారు. మండలంలోని గిలకపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లులు, చిన్నారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రిద్దాం


దుకాణాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేటటౌన్: ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కోరారు. ఆయన శనివారం సచివాలయ ఉద్యోగులతో కలిసి పట్టణంలో పలు దుకాణాలను తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చోరీపై విచారణ జరపండి

కోట: గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానం హుండీలో నగదు మాయంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు కోరారు. శనివారం దేవస్థానం వద్ద గ్రామస్తులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్‌లో స్వామి వారి బ్రహ్మోత్సవాల అనంతరం హుండీలో భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాలు మాయమైనట్లు తెలిపారు. ఆలయ పూజారి కార్తీక్, దేవదాయశాఖ ఈఓ శశాంక్ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారన్నారు. అనంతరం హుండీ చోరీపై విచారణ జరపాలని ఎస్ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై తిరుపతికి చెందిన విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. నిమ్మ మార్కెట్‌కు ఎదురుగా ఉన్న రెండు ఎరువుల దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఉన్న స్టాక్‌కు రికార్డుల్లోని లెక్కలకు తేడా ఉండడాన్ని గుర్తించారు. ముఖ్యంగా యూరియా నిల్వలకు సంబంధించి పలు వ్యత్యాసాలు ఉండడాన్ని గుర్తించారు. దీంతో దుకాణ యజమానులకు 6 ఏ నోటీసులు ఇచ్చారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ పీ మల్లికార్జున రావు, ఏఓ రామాంజనేయరెడ్డి, గూడూరు వ్యవసాయాధికారి వీ రమేష్ పాల్గొన్నారు .

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాపూరు/సైదాపురం/వాకాడు: వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలు అతిక్ర మిస్తే చర్యలు తప్పవని రాపూర్ సీఐ సత్యనారాయణ, సైదాపురం, కలువాయి, వాకాడు ఎస్ఐలు క్రాంతికుమార్, కోటయ్య, నాగబాబు స్పష్టం చేశారు. ఆయా స్టేషన్లలో వారు శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డుకు అడ్డంగా మండపాలు వేయకూడదని, విద్యుత్‌శాఖ దగ్గర అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించేవారు వాట్సాప్ నంబర్ 79950 95800ను కానీ, గణేష్ ఉత్సవ్ వెబ్‌సైట్‌ను కానీ సంప్రదించాలన్నారు. వివరాలు నమోదు చేసి, సచివాలయాల్లో చలానా రుసుం చెల్లించి అనుమతి పొందవచ్చన్నారు. చవితి మండపాల వద్ద డీజే సౌండ్స్ నిషిద్ధమని తెలిపారు.

విభజన ధోరణి తగదు


రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో నాయకులు

నాయుడుపేటటౌన్: దళితులను విభజించి పరిపాలించాలన్న ధోరణిని ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం సాయంత్రం ఎస్సీ ఉద్యోగ సంఘం నాయకులు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో చింతామోహన్ పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని కట్టుదిట్టం చేసుకునేందుకు అందరూ ఏకం కావాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న బీజేపీ విధానాలను అడ్డుకోవాలని చెప్పారు. పట్టణంలో గాంధీ పార్కు వరకు చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		24-8-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	105
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	196
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	216
లేయర్ చికెన్	:	200

చిలమానుచేను జెడ్పీ హైస్కూల్లో చెట్లకింద ఆహ్లాదకర వాతావరణంలో సమావేశాల నిర్వహణ



చిలమానుచేను పాఠశాల (ఇన్‌సెట్) దాతలు సమకూర్చిన కంప్యూటర్ ల్యాబ్



అమ్మ ఒడి.. మా బడి

- ఇటు 'నాడు – నేడు' అటు దాతల తోడు
- నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్న విద్యార్థులు
- పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం

ఓజిలి: ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటుకు దీటుగా విద్యాబోధన చేస్తూ నూరుశాతం ఉత్తీర్ణతను చిలమానుచేను విద్యార్థులు సాధిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణం.. అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు.. అవసరాలను చేకూర్చే దాతల సహకారంతో విద్యార్థులను అన్నింటిలో ముందుకు తీసుకెళ్తూ పాఠశాలను జిల్లాలో ఆదర్శంగా నిలుపుతున్నారు. ఈ ఏడాది కూడా 100 శాతం ఫలితాలు సాధించేందుకు ఇప్పటినుంచి విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. మండల పరిధిలోని చిలమానుచేను గ్రామంలో 30 ఏళ్ల క్రితం పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 244 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఆహ్లాదకరం..వాతావరణం

గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాల అభివృద్ధి చేసేందుకు నాడు–నేడు పథకంలో రూ.90లక్షలు నిధులు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, రంగులు, ప్రహరీ గోడ ఎత్తు పెంచడం వంటి కార్యక్రమాలను చేశారు. పాఠశాలలో ఎక్కడ చూసినా పచ్చని చెట్లు దర్శనమిస్తాయి. ఎక్కువ సమయం ఈ చెట్ల కిందనే విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. దాతలు సమకూర్చిన సరస్వతి విగ్రహం చక్కగా ఉంటుంది. పచ్చని చెట్ల మధ్య గాంధీ మహాత్ముడి విగ్రహం ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనం, క్రీడలు తదితర విషయాలు, విద్యార్థులకు సంబంధించిన ఏ ఒక్క కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా హెచ్‌ఎం సునీల్‌కుమార్ శ్రద్ధతీసుకుంటున్నారు. విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యాబోధన చేసేందుకు డిజిటల్ తరగతులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.


దాతలు సమకూర్చిన సైన్స్ ల్యాబ్‌లో ఉన్న పరికరాలు


దాతలు అందించిన బీరువాలు

దాతలు సమకూర్చిన వసతులు

మండలంలోని భట్లకనుపూరు గ్రామానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ పాఠశాలకు రూ.17లక్షలతో వసతులు సమకూర్చారు. రూ.13 లక్షలతో సైన్స్, సోషియల్ ల్యాబ్, మరో రూ.4 లక్షలతో సభావేదిక, ప్రత్యేక తరగతులకు ప్లాట్‌ఫాం వంటి సదుపాయాలు కల్పించారు. 1960లో పాఠశాలలో చదివిన విద్యార్థి కాశిభట్ల సత్యప్రసాద్ మిస్‌లోవా సాఫ్ట్‌వేర్ కంపెనీ ద్వారా రూ.25లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, 14 బీరువాలు, కూర్చీలు, టేబుల్స్, ర్యాక్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు.

కష్టపడితే ఉన్నత శిఖరాలు

ఓజిలి: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హెచ్‌ఎం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చిలమానుచేను ఉన్నత పాఠశాలలో నేషనల్ స్పేస్ డే ఉత్సవాలను శనివారం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ స్పేస్ డే విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన మోడల్స్, చిత్ర ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాత్కాలిక దుకాణాలకు టెండర్లు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానానికి చెందిన అగ్ని గుండం వేసే స్థలంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆలయ ఆవరణలో శనివారం దేవదాయశాఖ అధికారులు టెండర్ల ద్వారా వేలం నిర్వహించారు. ఆలయానికి చెందిన స్థలంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఆలయ అధికారులు ఎలాంటి అధికారిక ఆదేశాలు ఇవ్వకుండా నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేశారు. దీంతో ఈ నెల 10న అప్పనంగా నేతలకు దేవస్థాన స్థలం అనే శీర్షికన సాక్షిలో కథనం వెలువడింది. దీంతో అధికారులు ఆలయ స్థలంలో జరుగుతున్న పనులను నిలిపివేశారు. టెండర్ల ద్వారా అప్పగించి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. టెండర్ల ద్వారా నాలుగు నెలలకు రూ 1.40 లక్షలకు అద్దె ప్రాతిపదికన అప్పగించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ టెండర్ల వేలంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఆలయ ఈఓ రవిక్రిష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పల్లకీ సేవ


స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని అలిమిలి గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి శనివారం పల్లకిసేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి వేద మంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ పల్లకీ సేవ నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవలో తిప్పవరపాడు గ్రామానికి చెందిన బత్తల సుబ్బారెడ్డి, విజిత, సుజిత్‌కుమార్‌రెడ్డి, సాయినిత్య, నయన్‌దక్షిత్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం సాయంత్రం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీదేవి సమేత శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.


రోడ్డుపై విరిగిపడిన చెట్టు

కలిచేడు-మలిచేడు రహదారిపై శనివారం ఉదయం ఓ చెట్టు విరిగా రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు వాహనచోదకులు ఆ చెట్టును తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. - సైదాపురం

గాయపడిన యువకుడి మృతి

నాయుడుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, అన్నమేడు గ్రామానికి చెందిన బచ్చు ప్రవీణ్ (20) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డా డు. ప్రథమ చికిత్స అందించి ప్రవీణ్‌ను నెల్లూరుకు తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి పెంచలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 14వ వార్డు బొగ్గుల మిట్టలో ఆ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. బొగ్గుల మిట్ట ప్రాంతంలో లోటల్టేజ్ విద్యుత్ సమస్య అధికంగా ఉన్న కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆరి శంకరయ్య తెలిపారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి


మొక్క నాటుతున్న చిగురుపాటి పవన్, ఉపాధ్యాయులు

వెంకటగిరి రూరల్ : సమాజంలో ఉండే ప్రతి పౌరుడు మొక్కలు విరివిగా నాటి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని మార్పు సంస్థ అధ్యక్షులు చిగురుపాటి పవన్ పేర్కొన్నారు. మండలంలోని కలపాడు టీపీ కండ్రిగ గ్రామంలో మార్పు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 63వ రోజు శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలేఖ్య, శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సురవరం


నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిట్టమూరు : వామపక్ష ఉద్యమానికి ఊపిరి పోసిన పోరాట యోధుడు సురవరం మృతి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, శివారెడ్డి తెలిపారు. గూడూరు సీపీఐ కార్యాలయంలో శనివారం మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, శశికుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 31 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 31.092 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,330 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,400, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కాకాణిని కలసిన పురిటి పాళెం నాయకులు


కాకాణికి మొక్కను అందిస్తున్న దయాకర్

గూడూరురూరల్ : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డిని గూడూరు పట్టణ సమీపంలో ఉన్న పురిటి పాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం కలిశారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బుడతాటి దయాకర్‌తో పాటుగా పలువురు నాయకులు తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉన్న కాకాణిని కలిసి పలు విషయాలపై చర్చించారు. కాకాణిని కలసిన వారిలో పురిటిపాళెంకు చెందిన సైదాపల్లి ప్రవీణ్, చిన్నం విజయ్, గోను సుబ్రహ్మణ్యం, మచ్చల సురేష్, ఎం నాగేంద్ర ఉన్నారు.

ఎమ్మెల్సీ మేరిగకు పరామర్శ


మేరిగ మురళీధర్‌ను పరామర్శిస్తున్న పలువురు నాయకులు

చిల్లకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గూడూరులోని మేరిగ నివాసంలో నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఆయన్ను పరామర్శించారు.

రేషన్‌డీలర్స్ నూతన కార్యవర్గం


అధ్యక్షులు గౌష్‌బాషా, ఎంఏ నారాయణను సన్మానిస్తున్న డీలర్లు

వెంకటగిరి రూరల్: రేషన్‌డీలర్ల అసోసియేషన్ నూతన పాలకవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటగిరి అర్బన్ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా షేక్ రసూల్‌బాషాను రేషన్ డీలర్లు రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఏసీ ఓబయ్య, సెక్రటరీగా గౌరబత్తిన ఉష, సభ్యులుగా పవిత్ర, సునీతను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ మాజీ గౌరవ సలహాదారు, మాజీ ప్రెసిడెంట్ ఎంఏ నారాయణను, ప్రెసిడెంట్ షేక్ రసూల్‌ను రేషన్ డీలర్ల సభ్యులు సన్మానించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు


పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

దొరవారిసత్రం: మండలంలోని సూరపుఅగ్రహారం గ్రామ సమీపంలో డ్రోన్ కెమెరా సాయంతో అటవీ ప్రాంతంలో పేకాట స్థావరాన్ని గుర్తించి శనివారం సాయంత్రం స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలియజేశారు. పట్టుబడిన వారిని సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

జేవీవీ సభల పోస్టర్ల ఆవిష్కరణ

చిల్లకూరు: ప్రజల్లో మూఢనమ్మకాలను తరిమి కొట్టి సైన్సుపై మక్కువ పెంచుకునేలా ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్న జన విజ్ఞాన వేదిక (జేవీవీ) సంస్థ మహా సభలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. గూడూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో మహా సభలకు చెందిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా విద్యార్థులకు సైన్సుపై మక్కువ కలిగించేలా ఎగ్జిబిషన్‌లు, మ్యాజిక్ షోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు చెంచునారాయణ, రామోహన్‌రావు, సుబ్బారావు, సుమన్‌రెడ్డి, రజనీకాంత్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న ఆటో

పెళ్లకూరు: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు తొట్టంబేడు మండలం దొమ్మరపాళెం గ్రామానికి చెందిన అంకయ్య ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తికి ఆటోలో బయల్దేరాడు. మార్గం మధ్యలో అక్కగారిపేట గ్రామం వద్ద సర్వీసు రోడ్డులో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో అంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 1033 అంబులెన్స్ సిబ్బంది వెంటనే క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

చిల్లకూరు: పరిసరాల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని వైద్యులు అరాఫత్ సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గూడూరురూరల్: పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుమెప్మా వారి సహకారంతో నిర్వహించారు.

కోట: స్థానిక పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను శనివారం డీఎల్‌డీఓ వాణి పరిశీలించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా వీధుల్లో చెత్తను తొలగించి శుభ్రపరిచారు.

నాయుడుపేటటౌన్: పట్టణంలో మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సచివాలయ ఉద్యోగులు, మెప్మా అధికారులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కలువాయి(సైదాపురం): కలువాయి బీవీఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు డిప్యూటీ ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు.

అందమైన ఆకృతులతో రూపుదిద్దుకుంటున్న వినాయకుని విగ్రహాలు





సరికొత్త గణపయ్యలు

వినాయక చవితి సందర్భంగా పట్టణంలో వినాయకుని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. కొత్త కొత్త ఆకృతులలో వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలో 8కు పైగా విగ్రహాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కాకుండా అట్టపిండి మట్టి, చాక్ పౌడర్లతో విగ్రహాలను తయారుచేస్తున్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచే కాకుండ తమిళనాడు నుంచి వచ్చి బుకింగ్ చేసుకుంటున్నారు. నీళ్లలో కరిగి పోయే విగ్రహాలే అధిక సంఖ్యలో ఆర్డర్లు వచ్చినట్లు తయారీదారులు చెబుతున్నారు. - నాయుడుపేటటౌన్




నీటిలో కరిగిపోయేలా తయారు చేసిన విగ్రహాలు, నాయుడుపేటలో అమ్మకాలకు సిద్ధ చేసిన విగ్రహాలు, వర్షానికి తడవకుండా కవర్ కప్పిన దృశ్యం